క్లుప్తంగా

విద్యార్థి దశలో ఇంటర్ కీలకం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కోసిగి: విద్యార్థి దశలో ఇంటర్ విద్యాభ్యాసం కీలకమని కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానంలో రాణించాలంటే ఇంటర్మీడియట్ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఇంటర్‌ను తేలికగా తీసుకుంటే భవిషత్‌లో చాలా కష్టపడాల్సి వస్తోంది. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు సాంబశివుడు, ఉదయ్ భార్గవ్, లైబ్రేరియన్ ఉరుకుందు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



సుందరరాజు(ఫైల్)

నందవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. నందవరం ఎస్సీ కాలనీకి చెందిన సుందర రాజు(60) ఈ నెల 11వ తేదీ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స చేయించి ఈ నెల 24వ తేదీ ఇంటికి తీసుకొచ్చారు. ఇంటిలోనే వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. అయితే పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య మాణిక్యమ్మ, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలి

కౌతాళం: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు నరసన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలో అమరవీరుల స్మారక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి రేటు చాలా తగ్గిపోయిందని, వరికి గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రప్ప, పకీరప్ప, సుధాకర్, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వాహనాల షెడ్ తనిఖీ



శానిటరీ వర్కర్లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో శానిటరీ సెక్షన్ వాహనాల షెడ్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తనిఖీ చేశారు. ఏయే వాహనాలు షెడ్డులో ఆపుతున్నారు, బయట ఆపే వాహనాలు ఎన్ని, వర్కర్లు తదితర వివరాలను శానిటరీ వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. వెంకన్నపేట, పరిషముల్లా వీధిలో పర్యటించారు. మురుగు కాలువలు, కల్వర్టుల్లో చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. పట్టణ పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

20 మందికి ఉద్యోగాలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న నైపుణ్యాధికారి ఆనంద్‌రాజ్‌కుమార్

ఆదోని రూరల్: నిరుద్యోగులు నైపుణ్యాలను పెంచుకోవాలని నైపుణ్యాధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని న్యాక్ సెంటర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 38 మంది ఇంటర్వ్యూలకు హాజరవగా 20 మంది ఉద్యోగాలు పొందినట్లు నైపుణ్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో న్యాక్ ఇన్‌చార్జి ఉలిగన్న, కో–ఆర్డినేటర్ రాజశేఖర్, నాన్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు



పట్టణంలోని ఓ హోటల్‌లో ప్లాస్టిక్ వినియోగంపై హెచ్చరిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: హోటళ్లు, దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఉషా టిఫిన్ సెంటర్‌లో దాడులు నిర్వహించి యజమానికి రూ.10 వేల జరిమానా విధించారు. ప్లాస్టిక్ వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని కమిషనర్ తెలిపారు.

చైర్మన్‌కు క్షమాపణ చెప్పాల్సిందే!

- టీడీపీ కౌన్సిలర్ తీరును తప్పుపట్టిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు
- రసాభాసగా కౌన్సిల్ సమావేశం



పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభాసగా మారింది. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో చైర్మన్, సభ్యులు వాగ్వాదం చేసుకోవడంతో అర్ధాంతరంగా సభ ముగిసిన విషయం తెలిసిందే. గత కౌన్సిల్‌లో టీడీపీ కౌన్సిలర్ రాందాస్‌గౌడ్.... చైర్మన్‌ను దూషించడాన్ని తప్పుపడుతూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిరసన తెలిపారు. చైర్మన్‌కు ఆ కౌన్సిలర్ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తూ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కామర్తి నాగేషప్పలతో పాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పోడియ ఎదుట బైఠాయించారు. చైర్మన్‌కు క్షమాపణ చెప్పాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అయితే పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లను వైఎస్ఆర్‌సీపీ కౌన్సిలర్ కూడా దూషించారని, వారికి క్షమాపణ చెప్పాలంటూ టీడీపీకి కౌన్సిలర్లు సైతం నినదించారు. దీంతో సభ గందరగోళంగా మారింది. ఇరు పక్షాలకు చైర్మన్ వారించినా వినక పోవడంతో సభను ముగించారు. అయినప్పటికీ టీడీపీ కౌన్సిలర్లు, పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లు చైర్మన్‌ను చుట్టుముట్టారు. ఆయన పట్టించుకోకుండా వెళ్లిపోయారు. అంతకుముందు వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ మాట్లాడుతూ మిలటరీ కాలనీ నుండి కోసిగి రోడ్డుకు లింక్ రోడ్డు పనులు చేపట్టాలన్నారు. అదేవిధంగా ఓంశాంతి సర్కిల్ నుంచి శిల్పా ఎస్టేట్‌కు వెళ్లే దారిలో చెన్నకేశవరెడ్డి మార్గ్‌గా నామకరణం చేయాలని కోరారు. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలకు, స్థలాలు ఇచ్చిన హసన్‌బేగ్ స్థూపం పెట్టాలని చైర్మన్ మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై గతంలోనే కౌన్సిల్‌లో తీర్మాణం చేశారని పేర్కొన్నారు. సమావేశ అజెండాలోని 28 అంశాలతో పాటు టేబుల్ అజెండాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

గ్లోబల్ జీనియస్ కళాశాలపై చర్యలకు వినతి



ఎమ్మిగనూరు: డీటీకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గాంధీ నగర్‌లో కనీస మౌలిక వసతులు లేకుండా రాత్రి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్న గ్లోబల్ జీనియస్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయలులు ఖాజా, కృష్ణ, రఘు, అఫ్రిది, రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్హత లేని వారితో బోధన, కళాశాలకు క్రీడా మైదానం, సైకిల్ స్టాండ్‌లాంటి కనీస మౌలిక సదుపాయాలను కూడా యాజమాన్యం కల్పించలేదన్నారు.

కేసు నమోదు చేయాలి

గోనెగండ్ల: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న గోనెగండ్లలోని జీనియస్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి.భరత్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకున్నా 8వ తరగతి అడ్మిషన్లు చేసుకుని వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

స్మార్ట్‌మీటర్లు బిగిస్తే తీవ్ర పరిణామాలు



టెక్నికల్ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రీపెయిడ్ స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించి ప్రజలపై భారం మోపితే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, భాస్కర్ యాదవ్ హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా చేశారు. టెక్నికల్ ఏఈ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ప్రజలకు ఉరితాళ్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. తక్షణం మీటర్లు బిగించే కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ ఎత్తేసే కుట్రలో భాగంగానే ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.17వేల కోట్ల భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. సీపీఐ నాయకులు జబ్బార్, దాదావలి, తిమ్మగురుడు, రాజీవ్, మాలిక్, మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నగరవాటిక కోసం స్థల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: నగరవాటిక కోసం అనువైన స్థలం ఎంపిక చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మండిగిరి పంచాయతీ, పరిసర ప్రాంతాల్లో అటవీశాఖ, రెవెన్యూ, సర్వేయర్ అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. టూరిజం డెవలప్‌మెంట్‌లో భాగంగా ఆదోని పరిసర ప్రాంతాల్లో నగరవాటికకు సంబంధించి అనువైన ప్రాంతాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శివరాముడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, అటవీశాఖ అధికారులు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

గోనెగండ్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దనేలటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో విద్యకు మించిన సంపద మరొకటి లేదన్నారు. ఏదైనా సాధించినప్పుడే ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో మెలిగి అనుకున్నది సాధించేలా కష్టపడాలన్నారు. అలాగే మహిళా రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని.. వాటిని తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

శ్రీమఠంలో జుక్తిహీరే మఠం పీఠాధిపతి



శ్రీమఠం ప్రాంగణంలో ప్రదక్షిణలు చేస్తున్న బసవేశ్వర శివాచార్యులు

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటకలోని జుక్తిహీరేమఠం పీఠాధిపతి డా.కొత్తూరు బసవేశ్వర శివాచార్యులు శుక్రవారం మంత్రాలయం విచ్చేశారు. శ్రీమఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు. ముందుగా స్వామిజీ గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐ మంజునాథ్, ఎస్‌ఐ చంద్రమోహన్



పోస్టర్లు విడుదల చేస్తున్న తహసీల్దార్ శ్రీనాథ్, ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి

మంత్రాలయం : జిల్లా ఎస్పీ బింధుమాధవ్ ఆదేశాల మేరకు మంత్రాలయం సీఐ బి.రామాంజులు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం మంత్రాలయం, మాధవరం స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాల పోస్టర్ల విడుదలతోపాటు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాన కూడళ్లలో సైబర్ నేరాలపై ప్రజలకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలు ప్రస్తుత కాలంలో పెరిగిపోతున్నాయని సీఐ గుర్తు చేశారు. సైబర్ నేరాల ముసుగులో ఎంతోమంది అమాయకులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పుకొచ్చారు. సోషియల్ మీడియా పరిచయాలతో కొందరు యువత సైతం మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా సెల్ ఫోన్ నంబర్లు హ్యాక్ చేయడం, అకౌంట్లలో నగదును అపహరించడం జరుగుతోందన్నారు. సెల్ ఫోన్లలో మోసపూరిత ప్రకటనలకు లోనుకావొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పరమేష్ నాయక్, విజయ్‌కుమార్, ఆదోని వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగి: సైబర్ నేరాలు రోజురోజుకు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోసిగి సీఐ మంజునాథ్, ఎస్‌ఐ చంద్రమోహన్ సూచించారు. కోసిగిలోని తహసీల్దార్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, నారాయణ డిగ్రీ కళాశాల, కస్తూరీ భా గాంధీ బాలికల పాఠశాలలో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు పంచుకోరాదన్నారు. లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌లలో తెలయని లింక్స్‌ను ఏ మాత్రం క్లిక్ చేయరాదన్నారు. ఎవరైనా ఫోన్‌చేసి వ్యక్తిగత, బ్యాంక్ వివరాలు అడిగితే చెప్పొద్దని సూచించారు. ఫేక్ కాల్స్, అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కౌతాళం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నేరాల నియంత్రణ పోస్టర్లను సిబ్బందితో కలిసి సీఐ విడుదల చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో చాల మంది అమాయక ప్రజలను సైబర్ నేరగాళ్లు తమ ఉచ్చులోకి లాగి మోసగిస్తున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సోమ్లనాయక్, కానిస్టేబుళ్లు నారాయణ, మోహన్‌రాజు, రామచంద్ర, పులిరాజులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : సైబర్ నేరాలపై అప్రమత్తత ఎంతైనా అవసరమని తహసీల్దారు శ్రీనాథ్, ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. మండలంలోని సచివాలయాలు, తహసీల్దార్, మండల పరిషత్ తదితర ప్రభుత్వ కార్యాలయాకు వెళ్లి సిబ్బందికి సైబర్ నేరాల గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టర్లు విడుదల చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాల తీరును వారు వివరించారు.

ఆడపిల్లలను సంరక్షించుకుందాం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం: ఆడ పిల్లల సంరక్షన అందరి బాధ్యత అని, ఆడపిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది వారి జీవితాల్లో వెలుగులు నింపాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలిక హక్కులు, సంరక్షణపై ఐసీడీఎస్, ఆర్డీటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లల చదువు దేశానికే వెలుగునిస్తుందన్నారు. మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను చదివించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు వచ్చిన తరువాతనే వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే చేసిన వారితో పాటు సహకరించిన వారికి జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. బాలికలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి, ఆర్డీటీ సంస్థ అధికారి ఆదినారాయణ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరమే



మాట్లాడుతున్న ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి

ఆదోని సెంట్రల్: చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమేనని ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం లీలాస్ పాఠశాలలో బాలుర త్రోబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. దీంతో చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి మసలుకోవాలని సూచించారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లీలాస్ పాఠశాల కార్యదర్శి ప్రతిభా భాయ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఈరన్న, ఖలీల్ అహ్మద్, నరసింహులు, సుశీల, రామన్న, నరసింహరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నరసన్న, అలీ పాల్గొన్నారు.

జైభీం ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం



నూతన కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శుక్రవారం జైభీం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య, రాష్ట్ర కార్యదర్శి జడ రవి, జిల్లా అధ్యక్షుడు ముత్తు సుమాల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా అబ్రహం, అధ్యక్షుడిగా బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శిగా సత్యానందం, మండల అధ్యక్షుడిగా నాయకంటి ఆదాము, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఆదోని డివిజన్ అధ్యక్షుడిగా సంధ్య పోగు ఎర్రన్నలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

ఆదోని అర్బన్: స్థానిక మాతాశిశు ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని..ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శుక్రవారం స్థానిక ఆస్పత్రిలో అభివృద్ధి సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిలో అర్ధరాత్రి వచ్చినా డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. నెలకు 450 డెలివరీలు చేస్తారని, ఏటా 5 వేలకుపైగా గర్భిణులు సేవలు పొందుతున్నారని తెలిపారు.

వైభవంగా పద్మనాభ తీర్థుల ఆరాధన



పద్మనాభ తీర్థుల మూల బృందావనానికి హారతులు పడుతున్న పీఠాధిపతులు

మంత్రాలయం : మధ్వ మత సంస్థాన పూర్వపు పీఠాధిపతి పద్మనాభ తీర్థుల ఆరాధన వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. కర్ణాటకలోని గంగావతి తాలూకా ఆణెగుంది నవబృందావన క్షేత్రంలో బృందావనస్థులైన పద్మనాభ తీర్థుల ఆరాధన వేడుకలు చేపట్టారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. ఆరాధన సందర్భంగా స్వామిజీ మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం, వెండి కవచ ధారణతో మహా హారతులు గావించారు. అనంతరం పద్మనాభ తీర్థుల చరితను భక్తులకు ప్రవచించారు. వేడుకలో కర్ణాటక వాదిరాజ సోదే మఠం పీఠాధిపతి విశ్వవల్లభ తీర్థులు, అర్చకులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

ఎమ్మిగనూరుటౌన్: బాలల సంరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆర్‌డీటీ, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహలు అరికడదాం, ఆడబిడ్డలను కాపాడుకుందాం కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. సుధావతితో పాటు ప్రిన్సిపాల్ విజయరాణి మాట్లాడారు. బాల్య వివాహాలు లేని మండలంగా ఎమ్మిగనూరు మండలాన్ని మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. చిన్న వయసులో వివాహలతో వచ్చే అనర్థాలను వివరించారు. ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు, లేదా రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు లింగ వివక్ష చూపకూడదన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారి మల్లికార్జున



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ బాబురాజు

ఎమ్మిగనూరుటౌన్: క్షయ వ్యాధి నిర్మూలకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన శాఖ అధికారి మల్లికార్జున అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఖిబులా కాలనీ వైద్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. క్షయ వ్యాధి నిర్మూలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆదిలోనే వ్యాధిని గుర్తించాలన్నారు. ఎన్‌సీడీసీడీ సర్వే, స్కూల్ హెల్త్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. డాక్టర్ సాయి జాహ్నవి, ఎంపీహెచ్‌ఈఓ విజయకృష్ణ పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూనిట్ సూపర్ వైజర్(ఎంపీహెచ్‌ఓ) బాబురాజు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కస్తూర్బా విద్యాలయంలో క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలో 2025 నాటికి క్షయవ్యాధిని పూర్తిగా అరికట్టేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెండు వారాల కన్నా ఎక్కువగా దగ్గు ఉంటే డాక్టర్‌ను సంప్రదించి గళ్ల పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధికి గురైన రోగులకు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. పిల్లలకు బీసీజీ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. తుమ్మినా, దగ్గినా మోచేతులు అడ్డం పెట్టుకోవాలని సూచించారు. హెచ్‌ఎం శాంతి, ఉపాధ్యాయులు అరుణ, నాగరత్నమ్మ, మంజుల, శివమ్మ, విద్యావతి, శకుంతల పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న నాయకులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం గ్రామానికి చెందిన ఆటోకార్మికుడు కిషోర్ భార్య లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మృతురాలి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, సర్పంచ్ పాల్‌దినకర్ మృతురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తరపున నగదు అందజేశారు. అదేవిధంగా సీఐటీయూ తరుపున రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, యూనియన్ నాయకులు తమ వంతుగా రూ. 11,200 అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ బుజ్జీ స్వామి, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు వడ్డెరాము, మాజీ సర్పంచ్ అవతారం, ఆటో యూనియన్ నాయకులు గాదిలింగ, పవన్, తిప్పయ్య స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో ప్రిన్సిపాల్, అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 18 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఐటీఎం స్కిల్ అకాడమీ, బీఎంఎస్ సెక్యూరిటీ సంస్థల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 40 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 18 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ న్యూటన్ రాజు తదితరులు పాల్గొన్నారు.